సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 26 । జనవరి । 2025



గ్రామసభలు కావు.. దౌర్జన్య సభలు
సంక్షేమ పథకాల ఎంపికలంటూ నాలుగు రోజులపాటు జరిగినవి గ్రామసభలు కావు.. దౌర్జన్య సభలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. - 8లో▸



ఓడిపోయినా బుద్ధిరాలేదు..
పదేళ్లు ప్రజలను పీడించి గత ఎన్నికల్లో ఓడిపోయినా బీఆర్ఎస్ నాయకులకు బుద్ధి రాలేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 / 17^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ సాధారణంగా ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత ఉంటుంది.

రాజ్యాంగం నీడన.. ప్రగతి పూదోట

75 వసంతాల రాజ్యాంగ నీడలో పట్టణాలు, పల్లెలు మురిసిపోతున్నాయి. అందివచ్చిన అవకాశాలతో అభివృద్ధి పథంలో అగ్రభాగాన నిలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కొన్ని గ్రామాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. భుజాలు నొప్పెట్టే దాకా చేతి పంపుతో మందులు కొట్టి అలిసిపోయిన కాలం నుంచి.. డ్రోన్లతో పిచికారీ చేసే వరకు. ఆధునిక పరిజ్ఞానంతో వైవిధ్య పంటలు పండిస్తూ పరుగులు పెడుతున్నారు. వంటింటికే పరిమితమనుకున్న మహిళలు అందివచ్చిన అవకాశాలతో రాణిస్తూ చిరు పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు. జాతీయ జెండాను ఇళ్లపై ఎగరేస్తూ సమైక్యతా భావాన్ని చాటుతున్నారు. దేశం కోసమే తమ జీవితమంటూ కొందరు దేశ రక్షణ కోసం పనిచేస్తున్నారు. బలహీనులకు ఆపన్న హస్తం అందజేస్తూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వివిధ రంగాల్లో ఆధునిక పోకడలు, మహిళల ఆర్థిక ప్రగతి, దేశభక్తి తదితర అంశాలపై ప్రత్యేక కథనం.



అభివృద్ధి బాటలో పయనిస్తున్న పల్లెలు

- ఆధునికతను వినియోగించుకుంటున్న రైతులు
- సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులతో చిరు పారిశ్రామికవేత్తలుగా మహిళలు
- రాజ్యాంగ ఫలాలు వినియోగించుకుంటూ ముందుకు..

నేడు గణతంత్ర దినోత్సవం

రక్షణ పాఠాలకు వేదిక ఎల్బీకళాశాల

కళాశాల స్థాయి నుంచే రక్షణ రంగంలోకి..

రామన్నపేట : తెలంగాణ రాష్ట్ర సాధన తొలిదశ ఉద్యమంలో భాగంగా 1970లో లాల్‌బహదూర్ (ఎల్బీ) కళాశాలను వరంగల్ నడిబొడ్డున స్థాపించారు. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు (ఉత్తర తెలంగాణ) చెందిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులకు ఎల్బీ కళాశాల బాటలు వేసింది. తొలి రోజుల్లో 20 మంది ఎన్‌సీసీ (నేషనల్ కేడెట్ క్రాప్)తో మొదలై ప్రస్తుతం ఏడాదికి 300 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. కళాశాల నుంచి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి విభాగాల్లో 550 మందికిపైగా చేరినట్లు ఎన్‌సీసీ కెప్టెన్ సదానందం స్పష్టంచేశారు. అంతేకాకుండా సీర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, కోబ్రా, అస్సాం రైఫిల్, డీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ వంటి రక్షణ రంగాల్లో వందల సంఖ్యలో ఎల్బీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కొత్తగా ప్రవేశపెట్టిన అగ్నివీర్ ఎంపికల్లోనూ ఎల్బీ కళాశాల తమ సత్తాను చాటుతున్నారు. 1979లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఎల్బీ కళాశాలకు చెందిన విద్యార్థి బి.వెంకటేశ్వర్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కాంటిజెంట్ కమాండర్‌గా పరేడ్‌కు నాయకత్వం వహించాడు. అలాగే గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు గుగులోత్ రాము, బానోత్ మోహన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ, తెలిపారు.





ప్రత్యేక శిక్షణతోనే పరేడ్‌లకు ఎంపిక

కళాశాలలో చేరిన నిరుపేద విద్యార్థుల శక్తినే ముందే గుర్తించి కఠోరమైన శిక్షణ ఇస్తున్నాం. నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, డ్రిల్, ఆయుధాలపై శిక్షణ, యూనిఫాం ప్రాధాన్యత తెలపడం వంటి అంశాలు ఉంటాయి.
– సదానందం, కెప్టెన్



కాంతిమయం.. సౌర'పురం'

మరియపురంలో సోలార్ వీధిదీపాలు



గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురం సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో 2 కేవీ సామర్థ్యంతో 2023లో మొత్తం 17 మంది సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోగా ఒక్కొకరికి రూ.1.49 లక్షల ఖర్చు వచ్చింది. అందులో రూ.29 వేలు ప్రభుత్వం సబ్సిడీ కింద అందించింది. మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి సొంతంగా ఒక్కో లబ్ధిదారుడికి రూ.20 సాయం అందించారు. సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారుడు ఒక్కొక్కరికి నెలకు రూ.300 నుంచి రూ.800 వరకు విద్యుత్ బిల్లులు చెల్లించే అవసరం లేకుండా ఆదా అవుతోంది. కుటుంబ అవసరాలు పోనూ ఉత్పత్తిలో మిగిలిన కరెంటును విద్యుత్‌శాఖ వారికి అమ్ముతున్నారు. దీంతో వారికి నెలనెలా ఒక్కో ఇంటికి సుమారు రూ.500 వరకు ఆదాయం సమకూరుతోంది.



ఆధునికం.. పంటకు ప్రాణం

డ్రోన్‌తో మందుల పిచికారీ

ఖానాపురం: వ్యవసాయ సాగులో రైతులు ఆధునిక పద్ధతులు అవలంబిస్తున్నారు. పురాతన పద్ధతులతో సమయం, డబ్బు వృథా అవుతుండడంతో ఆధునిక పద్ధతుల వైపు దృష్టిసారిస్తున్నారు. పాకాల ఆయకట్టు కింద వేలాది ఎకరాల్లో వరి సాగవుతుండగా.. చాలా మంది రైతులు రసాయనాలను పిచికారీ చేయడానికి డ్రోన్‌లు వినియోగిస్తున్నారు. కూలీల కొరత, అధిక కూలి చెల్లించడానికి చెక్ పెడుతూ.. డ్రోన్లు వినియోగిస్తున్నారు. ఎకరాకు డ్రోన్‌కు రూ.400 తీసుకుంటుండడంతో తక్కువ సమయంలోనే పని పూర్తి చేసుకుంటున్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

హన్మకొండ అర్బన్: గణతంత్ర వేడుకలకు హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్, ఖిలావరంగల్ ఖుష్‌మహల్ మైదానం ముస్తాబైంది. ఉదయం 9గంటలకు ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారదలు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించనున్నారు. అదేవిధంగా పోలీస్ వందనం, సమరయోధులకు సత్కారం, ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.


ఖిలావరంగల్‌లో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు





ఖుష్‌మహల్, పరేడ్ గ్రౌండ్‌లో చేసిన ఏర్పాట్లు

పొదుపు.. స్వయం ఉపాధి



ఎల్కతుర్తి మండల సమాఖ్యకు జాతీయ పురస్కారం

ఎల్కతుర్తి : పొదుపుతోపాటు బ్యాంకులు ఇచ్చిన రుణాలను వినియోగించుకొని ఆర్థిక ప్రగతిని సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది జాతీయ అవార్డును దక్కించుకున్నారు.. ఎల్కతుర్తి మండల సమాఖ్య సభ్యులు. మండల సమాఖ్య పరిధిలో మొత్తం 946 గ్రామైక్య సంఘాలున్నాయి. ఒక్కో సంఘంలో 10నుంచి 15మంది సభ్యులతో 10,476 మంది కొనసాగుతున్నారు. ప్రతీనెల పొదుపుతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు పొందుతూ కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాంలు, కూరగాయల పంట సాగు, దుస్తువుల వ్యాపారం, పిండి గిర్నిలు, పేపర్ ప్లేట్లు, కిరాణం షాపులు ఏర్పాటు చేసుకొని, మార్కెటింగ్ చేస్తూ లబ్ధి పొందుతున్నారు. ఉత్తమ పనితీరు కలిగిన ఎల్కతుర్తి మండల మహిళ సమాఖ్య జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతీ ఏటా రూ.2కోట్ల టర్నోవర్‌తో వీరు ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉత్తమ పనితీరు కనబర్చిన ఎస్‌హెచ్‌జీల నుంచి ఏపీ మాస్ ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సంస్థ ఎస్‌బీఐ (స్టేట్‌బ్యాంక్ సంస్థ) ఏజెన్సీల మద్దతుతో దేశవ్యాప్తంగా గత ఏడాది 200 నామినేషన్లను స్వీకరించింది. కాగా 2024 సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా ఎల్కతుర్తి మండల సమాఖ్య ప్రథమ స్థానంలో ఎంపికై గత ఏడాది నవంబర్ 22న జాతీయ అవార్డు దక్కించుకుంది.

బడుగుల నేతకు జాతీయస్థాయి గుర్తింపు

- సామాజిక ఉద్యమకారుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ
- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- ప్రజా సంఘాల నాయకులు, ప్రజల హర్షం



హన్మకొండ: సామాజిక ఉద్యమకారుడు, బడుగుల నాయకుడు మంద కృష్ణ మాదిగకు జాతీయస్థాయి గుర్తింపు వచ్చింది. ప్రజా వ్యవహారాల్లో విశిష్ట సేవలు అందించినందుకుగాను కేంద్ర ప్రభుత్వం శనివారం పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. ఎస్సీల్లో మాదిగలకు జరుగుతున్న అన్యాయం, కోల్పోతున్న అవకాశాలపై మంద కృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా ఉద్యమం చేస్తున్నారు. ఎస్సీ వర్గీకరణతోపాటు, సామాజిక సమస్యలపై పోరాటం చేశారు. హనుమకొండ హంటర్ రోడ్‌లోని న్యూశాయంపేటకు చెందిన మంద చిన్న కొమురయ్య, కొమురమ్మలకు పదవ సంతానంగా మంద కృష్ణ మాదిగ 1965, జులై 7న జన్మించారు. ఆయన భార్య మంద జ్యోతి, సంతానం కిషన్, డాక్టర్ కృష్ణవేణి, కార్తీక్ ఉన్నారు.

1994లో ఉద్యమం మొదలు..

1994, జూలై 7న మంద కృష్ణ మాదిగ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ఈదురుమూడి గ్రామంనుంచి 14 మంది యువకులతో మాదిగ దండోరా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఎస్సీ కులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు అందాలని, మాదిగలను న్యాయం జరగాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. అనతి కాలంలోని బలమైన ఉద్యమ సంస్థగా ఎమ్మార్పీఎస్ ఎదిగింది. అణగారిన వర్గాల గొంతుకగా నిలిచింది. ఒకవైపు దండోరా ఉద్యమాన్ని కొనసాగిస్తూనే మరో వైపు వికలాంగులకు పెన్షన్, ఇతర హక్కుల సాధనకు, గుండె జబ్బుల వ్యాధులతో బాధపడుతున్న చిన్న పిల్లలు, వృద్ధులు, వితంతువుల పక్షాన పోరాటం చేశారు.

వర్గీకరణ విజయం..

ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ద్వారా 30 ఏళ్లుగా చేసిన ఉద్యమం ఇటీవల విజయం సాధించింది. విద్య ఉద్యోగ రిజర్వేషన్లలో ఎస్సీ ఉప వర్గీకరణకు అనుకూలంగా గత ఏడాది ఆగస్టు1న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. మంద కృష్ణ మాదిగ చివరి వరకు ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా, సామాజిక సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశారు. కాగా, మంద కృష్ణకు పద్మశ్రీ రావడం పట్ల పలువురు ప్రజా సంఘాల నాయకులు, ఉమ్మడిజిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఇక.. స్పెషలాఫీసర్లే..?

- నేటితో ముగియనున్న మున్సిపాలిటీల పాలకవర్గం గడువు
- వారి స్థానంలో ప్రత్యేక అధికారుల నియామకం..

సాక్షిప్రతినిధి, వరంగల్ : మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులు రానున్నారు. పాలకవర్గాల పదవీ కాలం నేటి(ఆదివారం)తో ముగియనుంది. మొదటగా ఆరు నెలలపాటు పాలకవర్గాల గడువు పొడిగిస్తారన్న ప్రచారం జరిగింది. 2020, జనవరి 22న అన్నింటితోపాటు ఉమ్మడి వరంగల్‌లో 9 మున్సిపాలిటీలు, 200 వార్డులకు ఎన్నికలు జరిగాయి. 25న ఓట్ల లెక్కింపు జరగ్గా.. 26 నుంచి పాలకవర్గాల పదవీ బాధ్యతల స్వీకరణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆదివారంతో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుండగా.. వారి స్థానంలోనూ స్పెషలాఫీసర్లను నియమించనున్నారు. ఇప్పటికే కలెక్టర్లు, కమిషనర్లకు ఆదేశాలు అందినట్లు సమాచారం. మున్సిపాలిటీల గ్రేడ్‌ను బట్టి జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు గానీ,లేదంటే సీనియర్ మున్సిపల్ కమిషనర్లను నియమించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా 9 మున్సిపాలిటీలకు స్పెషలాఫీసర్ల నియామకం జరగనుంది.

ఓటు వజ్రాయుధం

వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ



మాట్లాడుతున్న జిల్లా జడ్జి నిర్మల గీతాంబ

ఎంజీఎం: ఓటు అనేది ప్రతీ ఒక్కరి ప్రాథమిక హక్కు అని.. వేరే దేశాలతో పోలిస్తే మనం ఎంతో ప్రశాంతంగా ఉన్నట్లు తెలుస్తోందని వరంగల్ జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి జిల్లా జడ్జి నిర్మలగీతాంబ, కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో జిల్లా యంత్రాంగం సమష్టిగా పని చేసినందుకు వరంగల్ జిల్లాకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ 26న హైదరాబాద్‌లో అవార్డు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను శాలువాలు, పూలమాలతో సన్మానించి కొత్త ఓటర్లకు ఓటర్ కార్డును అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, విజయలక్ష్మి, తహసీల్దార్ ఇక్బాల్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి రమేశ్‌బాబు

యువత మత్తుకు బానిస కావొద్దు : ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి రమేశ్‌బాబు

కాజీపేట అర్బన్ : యువత మత్తుకు బానిస కావొద్దని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి రమేశ్‌బాబు పేర్కొన్నారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శనివారం హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ, నిట్ వరంగల్ ఎన్ఎస్ఎస్, ఏక్ భారత్ శ్రేష్ట భారత్ క్లబ్ సౌజన్యంతో డ్రగ్ దుర్వినియోగం, రాష్ట్రంలోని డీ–అడిక్షన్ పాలసీలు అనే అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా న్యాయమూర్తి రమేశ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నో ర్యాగింగ్, నో డ్రగ్స్ క్యాంపస్‌గా నిట్ వరంగల్‌ను తీర్చిదిద్దామని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. యువత కెరీర్‌ను నాశనం చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి..

- మంత్రి కొండా సురేఖ
- పోచమ్మమైదాన్ నుంచి బైక్ ర్యాలీ

రామన్నపేట : రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం వరంగల్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ నుంచి ఎంజీఎం వరకు ద్విచక్రవాహన ర్యాలీని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాతో కలిసి మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిర్లక్ష్యంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తగ్గించేందుకు ట్రాఫిక్ నియమాల్ని పాటించాలని కోరారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. జిల్లా పోలీసు రవాణా వ్యవస్థ అధికారులు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి, ఆర్ఎంఓ మురళి, కేఎంసీ విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న మంత్రి కొండా సురేఖ


కేహబ్‌లో పరిశోధన కేంద్రాలు

- ఐదు సెంటర్ల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ
- 32 రీసెర్చ్ ప్రాజెక్టులకు పచ్చజెండా
- ప్రొఫెసర్లకు ఉత్తర్వులందించిన వీసీ, రిజిస్ట్రార్
- త్వరలో వినియోగంలోనికి కేహబ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పరిశోధనల కోసం నిర్మించిన కేహబ్ త్వరలోనే వినియోగంలోకి రానుంది. ఈ కేహబ్‌లో ఐదు పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో సెంటర్ ఫర్ డ్రగ్ రీసెర్చ్, సెంటర్‌ఫర్ మెటీరియల్ ఫిజిక్స్, నానోడ్రగ్ డెలివరీ సిస్టమ్ (నానోసైన్సెస్), సెంటర్ ఫర్ ఎథినో మెడిసినల్ ప్లాంట్స్, సెంటర్ ఆన్ సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఉన్నాయి. ఆయా పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు శనివారం రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. వీటిని సంబంధిత ఆచార్యులకు వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అప్పగించారు. అదేవిధంగా 32 రీసెర్చ్ ప్రాజెక్టులను వివిధ విభాగాల ఆచార్యులను కేటాయించారు.

ఇటీవల ప్రతిపాదించిన ప్రాజెక్టులు..

యూనివర్సిటీలోని వివిధ విభాగాల ఆచార్యులు తమ వ్యక్తిగతంగా చేపట్టబోయే రీసెర్చ్ ప్రాజెక్టులను ఇటీవల ప్రతిపాదించారు. ఆయా ప్రాజెక్టులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వీరితో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. ఆయా ప్రాజెక్టుల పరిశోధనలపై సుదీర్ఘంగా చర్చించారు. ఐదు పరిశోధన కేంద్రాలు, 32 రీసెర్చ్ ప్రాజెక్టులకు కలిపి రూ.35 కోట్లు కేటాయించారు. ఈ నిధులు రాష్ట్రీయ ఉచ్చతర్ అభియాన్ (రూసా) మంజూరు చేసింది. అదేవిధంగా రూసా ద్వారా వచ్చిన మరో రూ.15కోట్లను కేహబ్‌లో ఇంక్యుబేటర్ సెంటర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంటుకు వినియోగించనున్నారు. పరిశోధనల కేంద్రాల ఏర్పాటు, ఇంక్యుబేటర్‌కు సంబంధించిన పరికరాలు త్వరలోనే కొనుగోలు చేసి ఏర్పాటు చేయనున్నారు.



ఆచార్యులకు ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి

న్యూస్‌రీల్

కేయూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల పరీక్షలు శనివారం 26 పరీక్షా కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. కేయూలోని హ్యూమానిటీస్ భవనం, ఇంగ్లిష్ విభాగంలో, హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల పరీక్షా కేంద్రాలను పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్, ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి పరిశీలించారు.

ప్రజాస్వామ్య విజయంలో ఓటర్లే కీలకం



హన్మకొండ అర్బన్ : ప్రజాస్వామ్య విజయంలో ఓటర్ల భాగస్వామ్యం ఎంతో కీలకమని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటుహక్కును ఎన్నికల్లో వినియోగించుకోవాలన్నారు. విద్యావంతులు, మేధావులు ఉండే పట్టణాల్లో ఓటింగ్ శాతం పెరగాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా యువ ఓటర్లు, సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. డీఆర్వో వైవీ గణేష్, ఏఈఆర్ఓ డాక్టర్ కన్నం నారాయణ, రమేష్, డీటీఓ శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్‌రావు, రావు అమరేందర్‌రెడ్డి, ఏనుగుల రాంప్రసాద్, జితేందర్, ఎండీ నేహల్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీధరాచార్యులకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



కాశిబుగ్గ/కాజీ సెంటర్: వరంగల్ పోచమ్మ మైదాన్ సమీపంలోని ఎల్‌బీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూమ్ అలీలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డాక్టర్ తంయ్యాల శ్రీధరాచార్యులకు శ్రీ కొమ్మూరి చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేసి సత్కరించారు. శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నాంపల్లి హైదరాబాద్‌లోని డాక్టర్ నందమూరి తారక రామారావు కళావేదిక సంస్థ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా సామాజిక, సాంస్కృతిక, విద్యారంగంలో చేస్తున్న సేవలకుగాను ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ముఖ్య అతిథిగా అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ సెంట్రల్ రామదాసు తేజావత్, విశిష్ట అతిథి తెలంగాణ ఫిలిం చాంబర్ చైర్మన్ డాక్టర్ పి.రామకృష్ణ గౌడ్, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్, కళారత్న బిక్కి కృష్ణ, ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస రాజు పాల్గొని సత్కరించారు.

ఢిల్లీ పరేడ్‌కు ఎన్‌సీసీ కేడెట్లు

కేయూ క్యాంపస్ : ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే (ఆర్‌డీ) పరేడ్‌కు కాకతీయ యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ బి.హరిప్రియ, కె.ఆశావర్ధన్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ శనివారం తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ఏసీపీకి ఉత్తమ ఎలక్టోరల్ అవార్డు



వరంగల్ క్రైం : సార్వత్రిక ఎన్నికల విధులను పగడ్బందీగా నిర్వహించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డిని జాతీయ ఎన్నికల సంఘం ఉత్తమ ఎలక్టోరల్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీకి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఏసీపీ జితేందర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

29న జాబ్‌మేళా

కాళోజీ సెంటర్ : ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతి, యువకులకు ఈనెల 29వ తేదీన వరంగల్ ములుగు రోడ్డు సమీపంలోని ఐటీఐ క్యాంపస్‌లో గల వరంగల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌లో ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం కోసం 7093168464 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరంగల్‌కు పేరు తెచ్చిన గౌతమ్



వరంగల్: వరంగల్ పైడిపల్లికి చెందిన ఎల్లావుల గౌతమ్‌యాదవ్ ఇటీవల బహ్రెయిన్‌లో జరిగిన ప్రపంచ పారా ఒలింపిక్స్ 2024లో పారా తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించి తెలంగాణ రాష్ట్రానికే పేరు తెచ్చారని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. గౌతమ్‌ను శనివారం కలెక్టర్ తన చాంబర్‌లో శాలువాతో సన్మానించి మెమెంటో అందించారు. ఇతర టోర్నమెంట్లలో పాల్గొనేందుకు కావాల్సిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి టీవీఎల్.సత్యవాణి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై స్కూల్ బస్ డ్రైవర్లకు అవగాహన



ఖిలా వరంగల్: సామాజిక బాధ్యతగా వాహనం నడిపి ప్రమాదాల నిర్మూలనకు పాటుపడాలని వరంగల్ ఆర్టీఓ గంధం లక్ష్మి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతామాసోత్సవాల్లో భాగంగా శనివారం వరంగల్ రవాణాశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఎంవీఐలు జయపాల్‌రెడ్డి, శోభన్‌బాబు ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఫైర్ అధికారులు అగ్నిప్రమాదాలపై, గుండె వైద్యులు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కిరణ్ వద్దిరాజ్, ప్రైవేట్ స్కూల్స్ బస్సుల ఓనర్స్ అధ్యక్షుడు స్వరూప్‌రెడ్డి, డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు..

ఎనిమిది మంది సభ్యుల అరెస్ట్
- రూ.38.84 లక్షలు అసలు.. రూ.21 లక్షలు నకిలీ నోట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిశోర్ ఝా



ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ క్రైం: రూ.లక్ష అసలుకు నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లు అందజేస్తామని నకిలీ నోట్ల విక్రయాలకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టయింది. ఎనిమిది మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ఈ మేరకు శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి భారీ మొత్తంలో అసలు నోట్లు రూ.38.84లక్షలు, నకిలీ నోట్లు రూ.21లక్షలు, నకిలీ నోట్ల ముద్రణకు అవసరమైన తెల్లకాగితాలు, కారు, ఆటో, తొమ్మిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నకిలీ నోట్ల విక్రయం ఇలా..

ప్రధాన నిందితుడు మణికాల కృష్ణ గొర్రెల వ్యాపారం నిర్వహించేవాడు. ఈ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయం తన అవసరాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని ప్రణాళిక రచించుకుని గొర్రెల వ్యాపారం ద్వారా పరిచయమైన వ్యక్తులతో తనకు అడవిలో డబ్బులతో కూడిన డ్రమ్ము దొరికిందని, అందులోని డబ్బు వినియోగిస్తే తన కుటుంబంలో ఆరోగ్య, ఇతర సమస్యలు ఎదురవుతున్నాయని నమ్మించాడు. ఎవరైనా రూ.లక్ష ఇస్తే వారికి ఆ డ్రమ్ములోని డబ్బు రెండింతలు ఇస్తానని, అలాగే రూ.లక్ష అసలు ఇస్తే నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లు ఇస్తానని నమ్మించేవాడు. ఇదే తరహాలో రెండో నిందితుడు ఎర్రగొల్ల శ్రీనివాస్‌తో పరిచయం కావడంతో కృష్ణ తన ప్లాన్ అమలు భాగంగా పాల్వంచ అడవిలో నకిలీ నోట్లతో భద్రపర్చిన డ్రమ్మునుంచి అసలు రూ.500నోట్ల కట్టని చూపించాడు. దీంతో అవి అసలు నోట్లని నమ్మిన శ్రీనివాస్ రూ.10లక్షల అసలు నోట్లగాను రూ.20లక్షలు, రూ.5లక్షల అసలు నోట్లకు రూ.20లక్షల నకిలీ నోట్లు మార్పిడి చేసుకునేందుకు నిందితుల ఇద్దరి మధ్య అంగీకారం కుదిరింది. తనకు ఆ డబ్బును హనుమకొండకు తీసుకొచ్చి అందజేస్తేనే ఈ ఒప్పందానికి అంగీకరిస్తానని శ్రీనివాస్.. కృష్ణకు షరతు విధించగా అంగీకరించారు. ఒప్పందం ప్రకారం ప్రధాన నిందితుడు కృష్ణ.. మరో నలుగురు నిందితులతో కలిసి కారులో శుక్రవారం కేయూసీ ఔటర్ రింగ్‌రోడ్డు, పెగడపల్లి క్రాస్ వద్దకు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ ఉన్న శ్రీనివాస్ మరో ఇద్దరు నిందితులతో కలిసి అసలు డబ్బుతోపాటు నకిలీ నోట్లను మార్పిడి చేసుకుంటున్న తరుణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో ఈ ముఠా సభ్యులందరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులు, కారు తనిఖీ చేయడంతో పెద్ద మొత్తంలో అసలు నగదుతో పాటు, నకిలీ నోట్లు, నకిలీ నోట్ల ముద్రణకు అవసరమైన తెల్లకాగితాలు లభించాయి. దీంతో విచారించగా నిందితులు తమ నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసినట్లు సీపీ అంబర్‌కిశోర్ ఝా పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు కృష్ణ ఇదే తరహాలో మరో మిత్రుడితో కలిసి తెల్ల కాగితాలపై రూ. 5 వందల నోటు ముద్రించి పలుమార్లు విక్రయిస్తూ పోలీసులకు చిక్కడంతో సత్తుపల్లి, వీ.ఎం. బంజర, లక్ష్మీదేవి పేట పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు సీపీ తెలిపారు. కాగా, ఏసీపీ దేవేందర్ రెడ్డి, కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, ఎస్సై మాధవ్, హెడ్‌కానిస్టేబుల్ నర్సింగ్ రావు, కానిస్టేబుళ్లు శ్యాంరాజు, సంజీవ్, సంపత్, హోంగార్డ్ రాజేందర్‌ను పోలీస్ కమిషనర్ అభినందించారు.

నిందితులు వీరే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం, మోరంపల్లి బంజార గ్రామానికి చెందిన మణికాల కృష్ణ, నక్రిపేట తండాకు చెందిన ధరంసోత్ శ్రీను, అదే గ్రామానికి చెందిన తేజావత్ శివ, ముల్కలపల్లి మండలం మూకమామిడి గ్రామానికి చెందిన గుగులోత్ వీరన్న, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్, ఉడుత మల్లేశ్, ఎర్రగొల్ల అజయ్, ఏపీలోని కర్నూల్ జిల్లా కుర్విపేట మండలం వేల్పనూర్ గ్రామానికి చెందిన బిజిని వేముల వెంకటయ్య అరెస్ట్ అయ్యారు.

బెల్లంపల్లి లోకోస్టార్‌దే రైల్వే క్రికెట్ ట్రోఫీ

- రన్నరప్ కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్టు
- ట్రోఫీని అందజేసిన ఏడీఆర్‌ఎం



మాట్లాడుతున్న ఏడీఆర్‌ఎం గోపాల్

కాజీపేట రూరల్ : రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో కాజీపేట రైల్వే స్టేడియంలో 12 రోజుల పాటు జరిగిన 76వ రిపబ్లిక్ డే సెలబ్రేషన్స్ క్రికెట్ లీగ్ సికింద్రాబాద్ డివిజనల్ లెవెల్ టోర్నమెంట్‌లో బెల్లంపల్లి లోకోస్టార్ విజయం సాధించింది. కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన బెల్లంపల్లి జట్టు 20 ఓవర్లకు 195 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్టు 20 ఓవర్లకు 180 పరుగులు చేసింది. ఈ సందర్భంగా విన్నర్, రన్నరప్ జట్లకు సికింద్రాబాద్ డివిజన్ అడిషనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్‌ఎం) ఎం.గోపాల్ బహుమతులు అందజేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాకారులు ఆహ్లాదకర వాతావరణంలో ఆడుకోవడం అభినందనీయమన్నారు. అంతకు ముందు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ ప్రత్యేక అతిథిగా హాజరై బెల్లంపల్లి లోకోస్టార్–కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్ల మధ్య టాస్‌వేసి పోటీని ప్రారంభించారు. ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ఆర్.ప్రశాంత్‌కృష్ణసాయి, వైస్ చైర్మన్ ఎస్.వి.వెంకటకుమార్, రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్, జెడ్‌ఆర్‌యూసీసీ మెంబర్ శ్రీనివాస్, ఓబీసీ సంఘం డివిజన్ ప్రెసిడెంట్ ఆర్.రమేశ్, ఇన్‌స్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సంక్షేమ పథకాల అమలు

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాల అమలు కార్యక్రమం నేడు (ఆదివారం) నుంచి ప్రారంభమవుతుందని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. హసన్‌పర్తి మండలం పెంబర్తిలో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలుపై శనివారం రాత్రి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలిసి వెంకట్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలు మార్చి వరకు కొనసాగుతాయని అప్పటి వరకు అధికారులు గ్రామాల్లో అర్హులను గుర్తించి పథకాలు అందజేస్తారని వివరించారు. అప్పటికీ జాబితాలో పేర్లు లేనివారు గ్రామాల్లో అధికారులకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పథకాలు అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, గృహనిర్మాణ శాఖ అధికారి రాజేందర్ ఇతర అధికారులు ఉన్నారు.

ఓడిపోయినా బుద్ధి రాలేదు

- బీఆర్‌ఎస్ నాయకులు పదేళ్లలో ఏంచేశారో ప్రజలకు చెప్పాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ సారయ్య

హన్మకొండ చౌరస్తా: పదేళ్ల ప్రజాధనం దోచుకుతిని, ప్రజలకు నరకం చూపించిన బీఆర్‌ఎస్ నాయకులకు ఓడిపోయినా బుద్ధి రావడం లేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్న పదేళ్లలో ఇచ్చిన ఒక్క వాగ్దానాన్నీ అమలుచేయని నాయకులు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం హోదాలో నాడు వరంగల్‌కు వచ్చిన కేసీఆర్ తన హామీల్లో ఒకటైన డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.300ల కోట్లు ఏమైనయి, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వచ్చిందా అని ప్రశ్నించారు. పదేళ్లలో ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ మడికొండ డంపింగ్ యార్డును త్వరలో తరలించి, అత్యాధునిక టెక్నాలజీతో విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ బల్దియాకు సంబంధించి స్టాంప్‌డ్యూటీ నిధులు రూ.173 కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి డీపీఆర్‌లు సిద్ధం చేశామని, వచ్చే నెలలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. చివరిగా సీఎం హోదాలో వరంగల్‌కు వచ్చిన కేసీఆర్ ఇచ్చిన హామీల ప్రసంగాన్ని డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు శ్రీమన్నారాయణ, శ్రీనివాస్, విజయశ్రీరజాలీ పాల్గొన్నారు.

గ్రామసభలు కావు.. దౌర్జన్యసభలు

- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, సుదర్శన్‌రెడ్డి, టి.రాజయ్య, నరేందర్

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు రోజులపాటు నిర్వహించింది గ్రామ, వార్డుసభలు కావు.. దౌర్జన్య సభలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ల సమావేశంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులను గ్రామ సభల్లో ఎంపిక చేయాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారన్నారు. కానీ, గ్రామసభలు మాత్రం సీఎం చెప్పిన దానికి విరుద్ధంగా జరిగాయని, లబ్ధిదారుల ఎంపిక జరగలేదని విమర్శించారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం చేయడం, పోలీసుల పహారా మధ్య గ్రామసభలు నిర్వహించుకున్నారన్నారు. ప్రభుత్వ తీరువల్ల వరంగల్‌కు వచ్చిన, రావాల్సిన కంపెనీలు వెళ్లిపోతున్నాయని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఎంతో మంచి అధికారి కలెక్టర్ పమేలా సత్పతిని పట్టుకుని మహిళ అని చూడకుండా మంత్రులు మాట్లాడిన తీరును ఖండించారు. మరొకరు చెట్టుకు కట్టేసి కొడుతామంటున్నారని, ఇచ్చిన హామీలు ఇవ్వాలని ప్రశ్నిస్తున్న ప్రజలను కొడుతారా అని ప్రశ్నించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేలకు ఏకే 47 తుపాకీ అవసరమా అని ప్రశ్నించారు. ఇవి వాడడానికి ఎస్‌ఆర్‌సీ ఆమోదం ఉందా అని ప్రశ్నించారు. పొలిటికల్ కేసులపై వరంగల్ పోలీసు కమీషనర్ రివ్యూ చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, నాయకులు మర్రి యాదవ రెడ్డి, నాగూర్ల వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, పులి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి పథకాల అమలుకు శ్రీకారం

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు ఆదివారం నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. శనివారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి మండలంలో ప్రజాప్రతినిధులను సంప్రదించి వారి సూచన మేరకు ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన ప్రతీ గ్రామంలోనూ పథకాల ప్రారంభోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. విమర్శలకు తావులేకుండా అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

- కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : మారుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాల ను పెంచుకోవాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివా రం కేయూలోని పరిపాలనా భవనం సెనేట్‌హాల్‌లో హైదరాబాద్ జెన్‌పాక్ట్ సంస్థ వారు నిర్వహించిన స్టెమ్ ఫర్ హర్ స్కాలర్‌షిప్ 2024–25 సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులు నూతన సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, భాషానైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీ క ళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్‌లాల్ మాట్లాడుతూ జెన్‌ఫాక్ట్ సంస్థ అందించే ఉపకార వేతనాల కు ఇంజనీరింగ్ ఫస్టియర్ విద్యార్థులకు ఇంటర్ స్థాయిలో 60 శాతం మార్కులు కలిగిన వారు జనవరి 30లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.40 వేల చొప్పున నాలుగేళ్లపాటు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎస్.ప్రసాద్, ఎస్.రమణ, కె.భిక్షా పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు

- కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి



శిక్షణలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని, దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. శనివారం నెహ్రూ యువకేంద్రం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ సౌజన్యంతో కేయూలోని గణితశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించిన మాదక ద్రవ్యాల నియంత్రణపై ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంపిక చేసిన యువతీయువకులకు రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం లేని సమాజ స్థాపన లక్ష్యంగా యువత పని చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ ప్రముఖ సైక్రియాటిస్టు డాక్టర్ ప్రహసిత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా యువత డ్రగ్స్ తీసుకుంటే కలిగే అనర్థాలపై వివరించారు. మీ చుట్టుపక్కల వారు ఎవరైనా మాదక ద్రవ్యాలు సేవిస్తూ కనిపిస్తే 1933 నంబర్‌కు తెలియజేయాలన్నారు. సమావేశంలో నార్కోడ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు, గణితశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ భారవిశర్మ, కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్.పి.రాజ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మధు, న్యాయవాది బానోత్ మహేందర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భిక్షపతి, సురేశ్ పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో టూరిజం పాత్ర కీలకం

భారతదేశ ఆర్థికాభివృద్ధిలో టూరిజం కీలక పాత్ర పోషిస్తుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగంలో ఆ విభాగం అధిపతి డాక్టర్ సీహెచ్.రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో పర్యాటక దేశాల్లో భారత దేశం కూడా ఒకటి అని, ఆయా ప్రదేశాలను దేశ, విదేశీ పర్యాటకులు చూడడానికి వస్తుంటారన్నారు. సమావేశంలో సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం అధిపతి ఆచార్య స్వర్ణలత, రాజనీతిశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, అధ్యాపకులు డాక్టర్ బ్రహ్మయ్య, డాక్టర్ కేవీఎస్ నరేందర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ ర్యాంకు సాధించాలి

- నగర మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : స్వచ్ఛ సర్వేక్షన్–2024లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు కృషి చేయాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, జవాన్లతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..స్వచ్ఛ సర్వేక్షన్‌లో నగరానికి ఉత్తమ ర్యాంకు సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలిపారు. పోటీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సూచించిన 13 (ఇండికేటర్స్) అంశాల పై శానిటేషన్ సిబ్బందికి సమగ్ర అవగాహన అవసరమని, తడి,పొడి చెత్తను వేరు చేసి అందించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డ్రెయినేజీ క్లీనింగ్ ప్రక్రియ ప్రతి వారం ఒకసారి లోతుగా తీయాలని అందుకు సంబంధించిన ఫొటోలను పంపించాలని తెలిపారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ పై (ఆర్‌ఆర్‌ఆర్)విస్తృత ప్రచారం కల్పించాలని మేయర్ కోరారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఎక్కువ మార్కులు పొందడానికి అవకాశం ఉన్న అంశాలను గుర్తించి వాటి అమలుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, హెచ్ఓ రమేశ్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఎంహెచ్ఓ డా.రాజేష్, ఈఈ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకను వెలికి తీయడానికే పోటీలు



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి

ఫేస్ పెయింటింగ్ వేస్తున్న విద్యార్థిని

సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి
- ఎస్సార్‌లో స్పార్కిల్ వేడుకలు ప్రారంభం

హసన్‌పర్తి: విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తులను వెలికితీయడానికి పోటీలు దోహదపడుతాయని ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ. వరదారెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్పార్కిల్ -25వేడుకలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ అభిరుచులకనుగుణంగా ప్రదర్శనలు ప్రదర్శించాలన్నారు. కాగా, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ వస్త్రాధారణ ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని పురస్కరించుకుని తబలా, మెహందీ, ట్రెజర్ హంట్, ర్యాంప్ వాక్, లైవ్ బ్యాంక్‌తో పాటు వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ శశిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.